# ఆతిథ్యం

తాతగారు మహా అసాధ్యుడు.

నడి యౌవనములో తృతీయ పురుషార్థాన్ని, సవ్యసాచిత్యం నెరపుతూ ఉల్లాసీదాలు కొట్టించాడనీ, కామకళా ప్రావీణ్యాన కాకలుదీరిన బంటనీ, ఇప్పటికీ - డెబ్బయ్యోపడిదాటిన పండు వయసులోకూడా - అడపా దడపా, అయన మీద మదనుని పూవుటమ్ములపదును పనిచేస్తూండటమే నిదర్శనం.

'డిండీరమండల విపాండురమై వెన్నెలలు ఓడిపోయే జాలుగడ్డమూ, ఈ షత్తు సడలించిన దేహధాటీ కౌమారాంతమే కలలోనిదని చెపుతూఉన్నా - మనిషిలో వయసు తిరిగిన చిన్నెలు ప్రస్ఫుటమౌతూఉన్నా - మనసులో పదుచుదనపు పస వసివాడనైనా లేదు.

నిజమే, 'అతడనేక యుద్ధముల నారియు తేరిన వృద్ధమూర్తి' - నేనో?

- ఆకాశం మోతీబులే దారిచేసిన రేషమీ షామియానాలాగా ఉన్నది. చకోర మిథునాలకి ఆ పక్షమంతా ఉపవాసదీక్ష.

పవమాన రసికుని వలపులు సందడి చేస్తూన్నవి. వసంత మాధవులు సపరివారంగా, మానవలోకాన్ని ఉక్కిరి బిక్కిరి చేసే సమయం.

ఇంకా నిద్రరావడం లేదు. చుక్కకన్నెల ముక్కువలు దర్శించే రసపారవశ్యంలో, పుస్తకాపేక్ష స్ఫురించలేదు. మెలకువగానే కలల అలల వలలో చిక్కుకున్నాను.

'కృష్ణా'

ఉపాంత స్థితిని తెలియజేసే చిరుసకిలింపు వినికూడా మొదట మెదలకుండా ఊరుకున్నాను. కబుర్లు వేయడం సరదాయే కాని - అప్పుడు ఇష్టంలేదు. పిలిచిన తరువాత - ఇక పలికేదాకా ఊరుకోడు మరి.

జవాబు చెప్పకుండానే అటూ ఇటూ మసిలాను. ఆయన దగ్గరకు వచ్చి, 'ఏం అప్పుడే నిద్రా' అన్నాడు.

'ఉహుఁ....'

'కూర్చో మరి, ఏమిటి ముసలి వాడిలాగా - వట్టి తాతయ్యలాగా....'

'అవును - తాతయ్యా'

'ఉహుఁ...విసిరావ్. నా మీద....'

'అబ్బ, నాకు నిద్ర వస్తూంది' - అని గట్టిగా అన్నాను - నిజంగా రాకపోయినా...

'నిద్రా? - ఈలాటి హుషార్ సమయంలో - విరహవేళలో - పదుచువాడవు - నీకు నిద్రా?'

'కాక ఏం చేయమన్నావు?' అన్నాను, లేచి కూర్చుంటూ. 'ఇక నిద్రపోదు.

ఫరవాలే'దని రూఢి చేసుకుని, తాతగారు సావకాశంగా, ఎదుటి పాలరాతి చప్టామీద కూర్చున్నాడు. తీరికగా చుట్టతీసి, ఆకారం సమపాళాలు స్పర్శతో ఆద్యంతాలూ పరీక్షచేసి, కొస పలుమొనతో ఐమూలగా గంటుపెట్టి, ఆ లేశాన్ని పరిహరించి, ముట్టించాడు, మునివేళ్ళతో చక్రావృతం చేస్తూ, సమంగా అంటుకుందని, దమ్ము ఊతాన తెలుసుకుని, మళ్ళా ఉపక్రమించాడు....

'ఏం చేయమంటావా? – అవునులే...నిన్నంటే యేం లాభం – మీ చదువులు జేస్తున్నాయి ఇదంతా – ఏదీ, చెయి ఈలా – తే – మేహనాడి – అసలు ఉందా, లేదా?'

'చాల్లెద్దూ – నీ మాటలు'

'కాదు బాబూ – ఉన్న మాటకు ఉలుకెందుకూ? – నీ యీడున నేను....అప్పటికి రసగంగాధరం చదివేశాను...యీ వేళప్పుడు, ఈలా ఒంటరిగా, కదలక మెదలకుండా ఉండేవాడినా...'

'కాక, మరి?'

'కర్మభూమి కాదుటోయ్ మనది. తాహత్ ఉన్న నాలుగు రోజులూ, కలలుగంటూ కూర్చుంటే ... తరువాత'

నేను పకపకా నవ్వాను. కాని, ఆయన అతి శాంతంగా, గంభీరంగా –

'అసలు, నిజానికి – నా లోపంకూడా ఉన్నదిలే, కొంత. నీవు నా మనమడివైనా మా ఇంట అతిధివి కాదుటోయ్. అర్షాచారాన్ని అనుసరించి....మర్యాద చేయమన్నానా యేమిటి?'

'అదోటి కూడానా?'

'అవును మరి. వెనుకటి రోజుల్లో, ఇంటికి వచ్చిన అతిధి ఇప్పటిలాగ, నిర్బంధ బ్రహ్మచర్యానుష్టానం చేయవలసిన అవసరం ఉండేది కాదు.'

'నేను నమ్మను'

అది నీ ఇష్టం. కాని, గ్రంధ ప్రామాణ్యాన్ని అంగీకరిస్తూ అందులో విషయాలు అబద్ధములంటావా? భరతుడికి, అతడి సైన్యానికి భరద్వాజుడు విందు చేసినప్పుడు, అన్ని వేలమందికి, అప్సరసలను కుదిర్చాడు ఆ రాత్రికి. నిజంగా అతడు, ఈలాటి గొడవలు లేని మహర్షి కదా. కాని, తప్పు పట్టించుకోకుండా చక్కగా అందరినీ ఎలా సత్కరించాడో చూడు. ఆ మజాలోపడి సైనికులందరూ, మర్నాడు బయలుదేరం అన్నారు కదూ.

అందాకా ఎందుకోయ్. నైషధంలో స్పష్టంగా లేదూ? నలుడి పెళ్ళికి, పెళ్ళికొడుకు తరుపు మొగబలగమంతా పదియా రేడుల పూవుబోండ్ల నునుపుంబాలిండ్ల కాఠిన్యసంపదతో, రాత్రులు మల్లుసాము మదనోన్మాదంబునం జేసినదని లేదూ. చూశావూ, ఆ భీమరాజ జంభారి బహుశః విడిదిలోకి, పెళ్ళి వారి ఉపయోగం నిమిత్తం ఒకే నైజం పిల్లల్ని యేరి పంపించి ఉండాలి?

పోనీ, తద్దినానికి వచ్చిన భోక్తకు 'అది' కూడా అమర్చేవారన్న సంగతి తెలుసునా?

శ్వేతకేతువుకు పూర్వాన మీకు యిప్పుడు టీ, సిగరెట్లలాగా – స్త్రీలు సర్వసాధారణంగా ఉండేవారుకదూ.

పోనీ, నీకు తెలిసిన విషయాలేగా? గిరీశబాబు 'బిల్వమంగళ ఠాకూరు'లో ఆ వర్తకుడు ఏం చేశాడు? ... చూడటంతోనే కన్నువేశాడు. వేయని చెప్ప వాల్చకుండానే, నదురూ బెదురూ లేకుండా అడిగేశాడు. 'నీ భార్యను నాకు అర్పించ'మని వర్తకుణ్ణి, లీలాశుకుడు. మహాప్రసాదం అనలేదూ? సరే చివరకు పాతివ్రత్యాస్త్ర ప్రయోగంతో బుకాయించి, తప్పించుకుని బయటపడ్డదనుకో.

మామిడి సింగన్నకు శ్రీనాథుడు కృతి యీయడానికి కారణం అతని యీ సత్కారానికి మురిసే కాదూ?

నిరవధిగా, ఇలానడిచి పోతూంది ఉపన్యాసం. యిక అడ్డుపడక ఉండలేక పోయినాను.

'బాగానే ఉంది, యిప్పుడు ఏం చేయమంటావు?' అన్నాను, కొంచెం విసువుతో, హుషారుగానే మాత్రం.

'నేను - చేయమన్నది - చేస్తావా?'

'ఓ'

'బయలుదేరు - చూడవలసిన విశేషాలుచూడు - కులాసాగా తిరుగు - అనుభవం లేకపోతే, మీరు యెందుకు పనికివస్తారు? అలసిన తరువాత నిద్ర రావాలి కాని - నిద్ర తెప్పించుకోవడమా? -'

'ఇక - వెళ్ళనా'

'అవశ్యం'

గత్యంతరం లేక - తప్పించుకుందామని - బయలుదేరాను, షర్టూ, అవీ వేసుకుని.

రెండు అడుగులు వేశాను. 'ఆగమని' సైగచేసి తాతగారు ఒక త్రుటిలో యింట్లోకి వెళ్ళి వచ్చారు. మరుక్షణంలో నా దుస్తులన్నీ అత్తరుతో ఘుమాయించినవి.

'అత్తరు రాచుకోందే, అందుకోసం బయలుదేరేటప్పుడు అడుగెల్లా సాగిందోయ్ నీకు?' అన్నాడు చేయి తన చెంపలకు తుడుచుకుంటూ...

సమరోత్సాహం కనబరుస్తూ నేను బయలుదేరినా - ఆయనకు తెలియదూ - దేవాంతకుడు - చివరకు ఏ సినిమాకో వెళ్ళి, వంచిన తల యెత్తకుండా తిరిగి వచ్చేస్తానని. నేను మళ్ళా యింటికి జేరుకునేలోపల ఎన్నిసార్లు నవ్వుకున్నాడో?

★ ★ ★